క్లుప్తంగా

అందుబాటులో పిల్లల వైద్య సేవలు

మణుగూరురూరల్: మండలంలోని వాగుమల్లారంలో మణుగూరు ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో పిల్లల వైద్యనిపుణుల సేవలు అందుబాటులో ఉన్నాయని, మణుగూరు సబ్ డివిజన్ పరిధిలోని మండలాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సునీల్ తెలిపారు. శ్వాసకోశ వ్యాధులతో బాధపడుతున్న ఇరువురు చిన్నారులకు పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ సుప్రియలు గత వారం రోజులుగా మెరుగైన వైద్యసేవలు అందించి కోలుకునేలా చేశారు. శుక్రవారం వైద్యసేవలు అందించిన వైద్యులను సూపరింటెండెంట్ సునీల్ ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నవజాత శిశువులతో పాటు ఆస్పత్రి వచ్చే చిన్న పిల్లలకు నిత్యం 24గంటల పాటు వైద్యసేవలు అందించేందుకు పిల్లల వైద్యులు అందుబాటులో ఉంటారని తెలిపారు.

మరమ్మతులు చేయించాలి

భద్రాచలంటౌన్: భద్రాచలం నుంచి వెంకటాపురం వరకు ప్రధాన రహదారిని వెంటనే మరమ్మతులు చేయించాలని టీటీడీపీ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ఆర్డీఓ కార్యాలయ ఏఓకి శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా డివిజన్ నాయకులు కొడాలి శ్రీనివాస్ మాట్లాడుతూ.. రాళ్లవాగు బ్రిడ్జి మరమ్మతుల గురికావడంతో పాటు రహదారిపై ఇసుక లారీలు తిరగడం వలన పెద్ద పెద్ద గుంతలు పడ్డాయన్నారు. ఈ గుంతల కారణంగా అంబులెన్స్‌లు, బస్సులతో పాటు రవాణా వాహనాలు రోడ్డు మీద సాగలేని పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు తాళ్లూరి చిట్టిబాబు, కంభంపాటి సురేష్ కుమార్, కుంచాల రాజారాం, కొడాలి చంటి, రేపాక రాంబాబు, అబ్బినేని శ్రీనివాస్, కొండవీటి అశోక్, కానమిల్లి రాఘవ, వెంకటాపురం మండల ప్రధాన కార్యదర్శి కొనే బాలమురళీకృష్ణ పాల్గొన్నారు.

ఎరువుల కొరతపై వినతి

దుమ్ముగూడెం: మండలంలోని సీతారాంపురం పరిసర ప్రాంత రైతులు శుక్రవారం మండల పర్యటనలో ఉన్నా ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావుకు ఎరువుల కొరతపై రైతులు వినతిపత్రం అందజేశారు. వ్యవసాయ సీజన్ ప్రారంభమై చాలా రోజులు గడుస్తున్నప్పటికీ యూరియా, డీఏపీ అందక రైతులు ఇబ్బందులు పడుతున్నారని, సొసైటీల ద్వారా అందిస్తున్న ఎరువులు సరిపోవటం లేదని ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. జిల్లా ఉన్నత అధికారులతో మాట్లాడి ప్రైవేట్ డీలర్లకు కూడా ఎరువులను కేటాయించాలని రైతులు కోరారు. అన్నె సత్యనారాయణమూర్తి, కుంజా శ్రీను, బొల్లోజు వేణు మాగంటి వెంకన్న, కొల్లి గోవిందు, సింహాద్రి రాజేష్, చప్పిడి రామచంద్రరావు, ఆల నగేష్, వెంకటకృష్ణ పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్‌ల అరెస్టు

అశ్వారావుపేటరూరల్: గ్రామ పంచాయతీల పెండింగ్ బిల్లులను చెల్లించాలనే డిమాండ్‌తో రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన 'చలో హైదారాబాద్' కార్యక్రమానికి తరలివెళ్తున్న పలువురు మాజీ సర్పంచ్‌లను స్థానిక పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. అరెస్టయిన వారిలో మండలంలోని ఊట్లపల్లి మాజీ సర్పంచ్ సాధు జోత్న బాయి, వేదాంతపురం మాజీ సర్పంచ్ సోని శివశంకర ప్రసాద్, గుర్రాల చెరువు పంచాయతీ మాజీ సర్పంచ్ కలపాల దుర్గయ్యలు ఉన్నట్లు ఎస్సై టి.యాయతి రాజు తెలిపారు. అనంతరం అరెస్టు చేసిన మాజీ సర్పంచ్‌లను సొంత పూచికత్తుపై విడుదల చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఉపాధి కల్పించాలి

అశ్వారావుపేటరూరల్: నిరుద్యోగ యువతకు ప్రభుత్వాలు ఉపాధి అవకాశాలు కల్పించాలని, ఉపాధి లేక యువకులు మత్తుపదార్థాలకు అలవాటు పడి జీవితాలను నాశనం చేసుకుంటున్నారని పీవైఎల్ రాష్ట్ర కోశాధికారి వాసం బుచ్చిరాజు అన్నారు. శుక్రవారం మండలంలోని కోయ రంగాపురం పీవైఎల్ మండల కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తక్షణమే కల్తీ కల్లు దుకాణాలను మూసివేయాలని కోరారు. ఈ నెల 22వ తేదీన పాల్వంచలో జరిగే పీవైఎల్ జిల్లా జనరల్ కౌన్సిల్ సమావేశాన్ని జయప్రదం చేయాలని పిలుపు నిచ్చారు. అనంతరం ప్రచార పోస్టర్లను ఆవిష్కరించారు. మండల నాయకులు కంగాల వెంకటేష్, లక్ష్మణ్‌రావు, సీతారామయ్య పాల్గొన్నారు.

లారీల రాకపోకలను నియంత్రించాలి

మణుగూరుటౌన్: కార్మిక డ్యూటీ సమయ వేళల్లో బొగ్గు లారీల రాకపోకలను నియంత్రించాలని టీబీజీకేఎస్ వైస్ ప్రెసిడెంట్ నాగెల్లి వెంకట్ అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. డ్యూటీ వేళల్లో బొగ్గు లారీల రాకపోకలకు నియంత్రణకు సంబంధిత అధికారులు ఆదేశాలున్నా కొందరి నిర్లక్ష్యం వల్ల ఓసీ-2, కేసీహెచ్‌పీల నుంచి డ్యూటీ సమయాల్లో రాకపోకలు సాగిస్తున్నాయన్నారు. రెండో షిఫ్ట్, రాత్రివేళ షిఫ్ట్‌లలో ఈ తీవ్రత అధికంగా ఉంటోందని వేగ నియంత్రణ పాటించకుండా ఇష్టానుసారంగా వాహనాలు నడుపుతున్నారని దాని వల్ల కార్మికులు ప్రమాదాల బారిన పడే అవకాశాలు ఉన్నాయని వాపోయారు. అధికారులు దృష్టి సారించి సమస్య పరిష్కరించాలని కోరారు.

అద్దెభవనాల్లో పల్లె దవాఖాన

- భారంగా మిద్దె ఖర్చులు
- సొంత నగదు చెల్లిస్తున్న ఏఎన్‌ఎం
- నాలుగేళ్లుగా ఇదే తంతు..



అద్దె భవనంలో కొనసాగుతున్న ఏఏఎం కేంద్రం

మణుగూరుటౌన్: మండలంలోని అనారోగ్య బాధితులు పీహెచ్‌సీ, ప్రధాన ఆస్పత్రులకు వెళ్ల లేని పరిస్థితుల నేపథ్యంలో వారి చెంతకే మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంగా ఏర్పాటు చేసిన పల్లె దవాఖాన ఏఏఎం (ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్) సేవలు భారంగా సాగుతున్నాయి. పట్టణంలోని ప్రధాన వార్డులోని సుందరయ్యనగర్‌లో ఏర్పాటు చేసిన ఈ దవఖానాకు శాశ్వత భవనం లేకపోవడమే ఇందుకు కారణం. నాలుగు సంవత్సరాలుగా అద్దె భవనంలో నిర్వహిస్తున్నా ఇటు అద్దెలు చెల్లించక, ఏఎన్‌ఎం తన సొంత జీతం నుంచే చెల్లించి దవాఖాన నిర్వహించడం విశేషం.

శాశ్వత భవనం దూరంగా ఉండడంతో..

మండలంలోని 14 పంచాయతీలతో పాటు పట్టణంలోని 20 వార్డుల్లో మొత్తం 20 పల్లె దవాఖానలు ప్రతి మూడు వేల జనాభా ప్రాతిపదికన ఒకటి ఉండే విధంగా ఏర్పాటు చేశారు. ఎన్‌హెచ్‌ఎం (నేషనల్ హెల్త్ మిషన్)లో భాగంగా వాటిల్లో 14 కేంద్రాలను అప్‌గ్రేడ్ చేస్తూ కేంద్రం ఏఏఎం (ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్)గా మార్చారు. ఏఎన్‌ఎంలతో పాటు అదనంగా ఎంఎల్‌హెచ్‌పీ (మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్)ని కేటాయించింది. మిగతా పల్లె దవఖానాలు సబ్ సెంటర్లుగానే కొనసాగుతున్నాయి. అయితే పట్టణంలోని ప్రధాన వార్డుగా ఉన్న సుందరయ్యనగర్ ఏఏఎం సెంటర్‌కు పట్టణ శివారు వాగుమల్లారంలో శాశ్వత భవనం నిర్మించగా.. దాదాపు 4 కిలోమీటర్ల దూరం ఉంది. దీంతో అప్పటి అధికారుల సూచన మేరకు సెంటర్‌ను దగ్గరగా తీసుకొచ్చి అద్దె భవనంలోనే నిర్వహిస్తున్నారు. నాలుగు సంవత్సరాలుగా ఇదే తంతు కొనసాగుతోంది. ఏఎన్‌ఎం తన సొంత నగదును అద్దెగా చెల్లించడం విశేషం. సుందరయ్యనగర్‌లో ఏఏఎం కేంద్రానికి శాశ్వత భవనం నిర్మించాలనే డిమాండ్ ఎప్పటినుంచో ఉన్నా పట్టించుకునే వారే కరువయ్యారు. దీంతో ప్రజలకు చేరువ చేయాలనే అధికారుల ఆకాంక్ష సుందరయ్యనగర్‌లో నిర్వహిస్తున్న సబ్ సెంటర్ అద్దె నిర్వహణ భారంగా ఉంది. మండల వైద్యాధికారులు పలుమార్లు సమస్యపై వినతిపత్రాలు అందజేసినా ప్రయోజనం లేకపోయిందన్న వాదనలున్నాయి.

సబ్‌సెంటర్‌దీ అదే పరిస్థితి..

శివలింగాపురంలోని సబ్ సెంటర్‌ను కూడా శేషగిరిగనగర్‌లో ఏర్పాటు చేయడంతో అది సుమారు 1కిలో మీటర్ ఉండేది. ఆ ప్రజలు సమీపంలోని పీహెచ్‌సీనే ఆశ్రయిస్తున్నారు. దీంతో ఆ సెంటర్‌ను కూడా మార్చి అద్దె భారంతో నిర్వాహకులకు భారంగా నడిపిస్తున్నారు. సమస్య పరిష్కరించి నాలుగు సంవత్సరాలుగా అద్దె భవనంలో కొనసాగిస్తున్న సబ్ సెంటర్‌ను శాశ్వత భవనానికి మార్చాలని, శివలింగాపురానికిచేరువగా కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

అధికారుల దృష్టికి తీసుకెళ్లాం..



నాలుగు సంవత్సరాలుగా సుందరయ్యనగర్‌లో అద్దె భవనం, సొంత ఖర్చులతో నిర్వహిస్తున్న అంశాన్ని అధికారులకు తెలిపాం. కట్టిన అద్దె వివరాలు అందించాం. అధికారుల నోటీసులో సమస్యను ఉంచాం. శాశ్వత భవన నిర్మాణానికి సుందరయ్యనగర్‌లో స్థలం ఉందా లేదా అన్న అంశంపై పరిశీలిస్తామని తెలిపారు.

– పిన్నింటి నిశాంత్‌రావు, మెడికల్ ఆఫీసర్

పీహెచ్‌సీల్లో తనిఖీలు



పర్ణశాల వైద్యశాలలో రికార్డులను పరిశీలిస్తున్న ఏడీయంహెచ్‌ఓ

దుమ్ముగూడెం: డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ చైతన్యతో కలిసి అదనపు డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ సైదులు దుమ్ముగూడెం, పర్ణశాల ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలను శుక్రవారం తనిఖీ చేశారు. వైద్యశాలల్లోని రికార్డులు, ల్యాబ్‌లు, డ్రగ్ స్టోర్‌లను పరిశీలించారు. అనంతరం వైద్యశాల పరిధిలోని గర్భిణులకు సంబంధించి, వ్యాధులకు సంబంధించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. వైద్య సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలని, సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వైద్యశాల పరిధిలోని గ్రామాల్లో ఫ్రైడే డ్రైడే తప్పనిసరిగా చేయాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్లు రుక్మాకర్‌రెడ్డి, రేణుకారెడ్డి, హోమియోపతి డాక్టర్ రాజేష్, డీపీఎంఓ పాయం శ్రీనివాసరావు, హెచ్‌ఈఓ లింగ్యా, వైద్యసిబ్బంది వెంకట నర్సమ్మ, అమ్మాజీ, నాగేశ్వరరావు, కృపారాణి, సుజాత, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

శ్రమదానంతో రోడ్డుకు మరమ్మతులు

గుండాల: తమ గ్రామంలో అభివృద్ధి జరగడం లేదంటూ ఆళ్లపల్లి మండలంలో సంది బంధం గ్రామస్తులు ఆవేదన వ్యక్తంచేశారు. శుక్రవారం సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా–మాస్‌లైన్ గ్రామ కమిటీ ఆధ్వర్యంలో వీధి రోడ్డుకు మరమ్మతులు చేపట్టారు. తమ గ్రామంలో అనేక సంవత్సరాలుగా రోడ్ల సమస్యలు ఉన్నాయని, సీసీ రోడ్ వెయ్యాలని స్థానిక ప్రజాప్రతినిధులకు అధికారులకు పినపాక నియోజకవర్గ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు దృష్టికి తీసుకువెళ్లినామని తెలిపారు. అయినా ఫలితం లేకపోగా ప్రజలు రోడ్డుపై నడవాలంటే ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ క్రమంలో గ్రామస్తుల సహకారంతో జెసిపి ట్రాక్టర్లతో మట్టిని తోలి సుమారు 400 మీటర్ల రోడ్డును బాగు చేసుకున్నామని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు ప్రజాప్రతినిధులు స్పందించి సంది బంధం గ్రామంలో సీసీ రోడ్లను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంధి బంధం గ్రామ కమిటీ నాయకులు బొమ్మల గౌరయ్య, జోగ సారన్న, ఈసం సమ్మయ్య, బొమ్మల వసంత రావు, గొగ్గల భరత్, బొమ్మల శ్రీను తదితరులు పాల్గొన్నారు.



రోడ్డుకు మరమ్మతులు చేస్తున్న గ్రామస్తులు

స్కాలర్‌షిప్ విడుదల చేయాలని నిరసన



వినతి పత్రం అందిస్తున్న నాయకులు

గుండాల: పెండింగ్‌లో ఉన్న స్కాలర్ షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయాలనీ కోరుతూ ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో శుక్రవారం తహసీల్దార్ కార్యాలయాన్ని ముట్టడించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్‌కె.షాహిద్ మాట్లాడుతూ.. నాటి ముఖ్యమంత్రి వైఎస్. రాజశేఖర్ రెడ్డి పేద విద్యార్థుల ఉన్నత విద్య కోసం ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని తీసుకొచ్చారని, ఎంతో మంది విద్యార్థులు ఈ పథకం ద్వారా లబ్ధి పొందారని గుర్తుచేశారు. కానీ నేడు అధికారంలో ఉన్న అదే కాంగ్రెస్ ప్రభుత్వం ఈ పథకాన్ని నిర్వీర్యం చేసే విధంగా వ్యవహరిస్తోందన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలని కోరారు. సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్‌కు అందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కొప్పుల పవన్, కల్యాణ్, ఎస్‌కె.నాసిర్, ఎస్‌కె.షబ్బీర్, పల్లెర్ల రవి వర్మ, యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

చినరాయిగూడెంలో వైద్యశిబిరం

మణుగూరురూరల్: మండలంలోని గుట్టమల్లారం గ్రామపంచాయతీ డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల ప్రాంతంలో మణుగూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం వైద్యశిబిరం నిర్వహించారు. డాక్టర్ నిశాంత్‌రావు గ్రామస్తులకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. తొలుత గ్రామంలో ఇంటింటిని సందర్శించి పరిసరాలను పరిశీలించారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చేసుకోవాలని సూచించారు. అనంతరం నీటి నిలవల్లో యాంటి లార్వా ద్రావణాన్ని వేశారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది రాంప్రసాద్, పార్వతి తదితరులు పాల్గొన్నారు.

వరినాట్లు వేసిన విద్యార్థులు

అన్నపురెడ్డిపల్లి (చంద్రుగొండ): మండలంలోని ఎర్రగుంట గ్రామంలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు శుక్రవారం వరినాట్లు వేశారు. గ్రామశివారులోని మోదుగుల కుంట ఆయకట్టులో క్షేత్రస్థాయిలో ప్రదర్శనలో భాగంగా ఉపాధ్యాయులతో కలిసి విద్యార్థులు వరినాటు కార్యక్రమంలో భాగస్వామ్యులయ్యారు. ఆరు నుంచి ఏడో తరగతి వరకు సాంఘిక శాస్త్ర పాఠ్య పుస్తకంలో వ్యవసాయ సంబంధిత పాఠ్యాంశాన్ని పురస్కరించుకుని క్షేత్రస్థాయిలో అవగాహన కోసం పాఠశాలలోని ఏకో క్లబ్, నేషనల్ గ్రీన్‌కోర్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఎంఈఓ ఉండేటి ఆనందర్‌కుమార్, ఏకో క్లబ్ ఇన్‌చార్జ్ సునందారెడ్డి, ఉపాధ్యాయులు జయరాం, సుశీల, శంకర్‌మహదేవన్, వి.వెంకటేశ్వర రావు సీఆర్‌టీలు శిరీష, ఖాసీంలు పాల్గొన్నారు.



వరినాట్లు వేస్తున్న విద్యార్థులు..

కేటీఆర్‌ను కలిసిన మాజీ సొసైటీ చైర్మన్

దమ్మపేట: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌ను దమ్మపేట సొసైటీ మాజీ చైర్మన్, జిల్లా రైతు సమన్వయ సమితి మాజీ అధ్యక్షుడు రావు జోగేశ్వరరావు, ఖమ్మంలోని మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ నివాసంలో శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కేటీఆర్‌కు పుష్పగుచ్ఛాన్ని అందజేశారు.

పెన్షనర్ల కమిటీ ఏకగ్రీవం

దమ్మపేట: మండలంలోని పట్వారిగూడెం గ్రామంలో ఎమ్మార్పీఎస్ అనుబంధ పెన్షన్ గ్రామ కమిటీని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షుడిగా పర్సా జయసుధ, ఉపాధ్యక్షుడిగా మల్లాది వెంకన్నలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు రవి, కోలికపోగు కాంతారావులు మాట్లాడుతూ.. పెన్షన్ దారుల మహా గర్జన ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఈనెల 24న కొత్తగూడెంలో నిర్వహిస్తున్నారని, జిల్లా వ్యాప్తంగా గల పెన్షన్ దారులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

నాసా ప్రాజెక్ట్‌లో విద్యార్థుల ప్రతిభ

భద్రాచలంటౌన్: భద్రాచలం శ్రీ చైతన్య పాఠశాల విద్యార్థులు నాసాప్రాజెక్ట్ రోబోటిక్ ఆస్ట్రోయిడ్ ప్రోస్పెక్టర్ ఆర్‌ఏపీ–3 ప్రాజెక్టును విద్యార్థులు తమ స్వశక్తితో తయారు చేసి ప్రతిభ చాటారు. ఈ ప్రాజెక్ట్‌కు రాష్ట్ర స్థాయిలో ద్వితీయ బహుమతి వచ్చింది. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వేణుగోపాల్ శుక్రవారం పాఠశాల జరిగిన కార్యక్రమంలో విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో అకాడమిక్ డీన్ వెంకటకృష్ణ, సీబ్యాచ్ ఇన్‌చార్జ్ అలెయ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాస్టర్ మృతికి సంతాపం

చర్ల: మండలంలోని తేగడకు చెందిన కుప్పాల పూర్ణచంద్ మనోహర్ దుమ్ముగూడెం మండలంలోని చిననల్లబల్లిలో పాస్టర్‌గా పనిచేస్తుండగా.. అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందాడు. ఈ మేరకు తేగడలో ఆయన మృతదేహం వద్ద డోర్నకల్ అధ్యక్ష మండల పీఠాధిపతి బిషప్ డాక్టర్ కోడిరెక్కల పద్మారావు శుక్రవారం నివాళులర్పించి మాట్లాడారు. ఆయన కుటుంబానికి అండగా నిలుస్తామని తెలిపారు. దుమ్ముగూడెం గ్రూప్ చైర్మన్ కేటీ.విజయకుమార్, పాస్టరేట్ చైర్మన్ జి.సాల్మన్‌రాజుతో పాటు రవి రత్నరాజు, కెయిస్ సుధాకర్, యాధాల రవికుమార్, నక్కా ప్రభాకర్, జడ్.రత్నరాజు ఎం.ప్రవీణ్ నివాళులర్పించారు.

24న మహా సదస్సు

అశ్వారావుపేటరూరల్: ఈ నెల 24వ తేదీన జిల్లా కేంద్రంలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో జరిగే జిల్లా స్థాయి మహా సదస్సును జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా బాధ్యులు ములకలపల్లి రవి మాదిగ కోరారు. శుక్రవారం అశ్వారావుపేటలో ఎమ్మార్పీఎస్, అనుబంధ సంఘాలతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వితంతువు, దివ్యాంగులు, వృద్ధులు, ఒంటరి మహిళలు, హెచ్ఐవీ, బోధకాలు బాధితులకు పెన్షన్ పెంచుతామని ఎన్నికల ముందు సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. సదస్సుకు పెన్షర్లు, ఎమ్మార్పీఎస్ బాధ్యులంతా హాజరు కావాలని కోరారు. రమణ్య, కోలేటి ఫకీరయ్య, నార్లపాటి శ్రీను, తగరం ఏసు రత్నం, గాలంకి అశోక్, గురునాథం, చిలక చిరంజీవి, సోమయ్య పాల్గొన్నారు.

పాఠశాలను పరిశీలించిన ఎమ్మెల్యే

దమ్మపేట: మండలంలోని నాగుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను కలసి స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ శుక్రవారం పరిశీలించారు. పాఠశాలలో నిర్వహించిన శ్రమదానంలో పాల్గొని చెత్తాచెదారాన్ని శుభ్రం చేశారు. పాఠశాల ఆవరణలో మొక్కను నాటి, నీరు పోశారు. పాఠశాలకు నూతనంగా మంజూరైన టేబుల్ టెన్నిస్ బోర్డును, రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. విద్యార్థులతో కలసి మధ్యాహ్న భోజనం చేసి, భోజన నాణ్యత పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ఇదే పాఠశాలలో 2002–03 విద్యా సంవత్సరంలో పదో తరగతి పూర్తి చేసుకున్న పూర్వ విద్యార్థులు ఆర్థిక సహాయంతో అందజేసిన బెల్టు, ఐడీ కార్డులను ఎమ్మెల్యే చేతుల మీదుగా విద్యార్థులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ కీసరి లక్ష్మి, హెచ్‌ఎం బజ్జూరి సరళ, రిటైర్డ్ హెచ్‌ఎం ప్రభుదాస్, పూర్వ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులు, హెచ్‌ఎంతో కలిసి భోజనం చేస్తున్న ఎమ్మెల్యే జారే ఆదినారాయణ

భద్రాచలం ఎమ్మెల్యే పర్యటన

దుమ్ముగూడెం: మండలంలోని డబ్ల్యూఎల్ రేగుబల్లి గ్రామపంచాయతీలో భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు శుక్రవారం పర్యటించారు. ఈ పర్యటనలో భాగంగా గ్రామస్తులతో పాటు ఎమ్మెల్యే తాలిపేరు కాలువను పరిశీలించారు. తాలిపేరు కాలువ నుంచి వచ్చే నీరు రేగుబల్లి పంట పొలాలకు అందడం లేదని ఎమ్మెల్యేకి గ్రామస్తులు తెలియజేశారు. వెంటనే ఎమ్మెల్యే చరవాణి ద్వారా ఇరిగేషన్ అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకోవాలని అధికారులకు ఎమ్మెల్యే ఆదేశించారు. అలానే గ్రామస్తులు ఇందిరమ్మ ఎల్1 లిస్టులో తమ పేర్లు లేవని ఎమ్మెల్యే దరఖాస్తులు అందజేయగా ఎమ్మెల్యే కలెక్టర్‌తో మాట్లాడి ఎల్1 లిస్టులో లేని పేర్లను లిస్టులోకి తీసుకువచ్చే విధంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం మాజీ జడ్పీటీసీ అన్నె సత్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో వివిధ పార్టీలకు చెందిన 30 కుటుంబాలు కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తెల్లం సీతమ్మ, కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు లంక శ్రీనివాసరావు, కుంజా శ్రీనివాసరావు, మోతుకూరి శ్రీకాంత్, వెంకన్న రాజు, కొండపల్లి నరేంద్ర, జెట్టి రామకృష్ణ, ఎస్‌కె.ఖాదర్, బొల్లి శేఖర్, అయ్యప్ప రెడ్డి శ్రీధర్ పాల్గొన్నారు.



కాంగ్రెస్ పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే డాక్టర్ వెంకట్రావు

హక్కుల సాధనకు పోరాటాలే శరణ్యం

గుండాల: ఉపాధ్యాయ ఉద్యోగుల హక్కులు సాధించుకోవాలంటే పోరాటాలే శరణ్యమని టీపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు జోగు రాంబాబు పిలుపునిచ్చారు. శుక్రవారం ఆళ్లపల్లి మండల కేంద్రంలో జరిగిన మండల శాఖ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఉద్యోగ ఉపాధ్యాయుల హక్కుల సాధన కోసం శాంతియుతమైన మరియు వ్యూహాత్మకమైన పోరాటాలే ప్రస్తుతం ఏకైక మార్గమని అన్నారు. ఈనెల 23, 24 తేదీల్లో మండల తహసీల్దార్ ద్వారా సీఎంకు వినతిపత్రాలు సమర్పణ, ఆగస్టు 1న జిల్లా కేంద్రంలో ఉపాధ్యాయుల ధర్నా, ఆగస్టు 23న ధర్నా చౌక్, హైదరాబాద్ వద్ద నిరసనకు ఉపాధ్యాయ సంఘాలు చిత్తశుద్ధితో కలిసికట్టుగా ముందుకు సాగాలన్నారు. సమావేశంలో మండల ప్రధాన కార్యదర్శి ఈసం ముత్తయ్య, బి.రవి, రమేష్, కుమార్ రాజా, సంపత్, బావ్ సింగ్, రామయ్య, తులసిరామ్, చిన్న, శ్రీను, రాము తదితరులు పాల్గొన్నారు.

ఫీవర్ సర్వే- ఫ్రైడే డ్రైడే పరిశీలన



గ్రామస్తులతో మాట్లాడుతున్న డాక్టర్ స్పందన

దుమ్ముగూడెం: దుమ్ముగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోపి అచ్చుతాపురం గ్రామంలో జరుగుతున్న ఫీవర్ సర్వే–ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని జిల్లా మలేరియా ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ స్పందన శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు సీజనల్ వ్యాధులు గురించి అవగాహన కల్పించారు. తీసుకోవాల్సి ఆరోగ్య, పరిశుభ్రత చర్యలను వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ రుక్మాకర్ రెడ్డి, సబ్ యూనిట్ ఆఫీసర్ ధర్మరాజు, సూపర్‌వైజర్ సాగర్, హెల్త్ అసిస్టెంట్ గంగాధర్ గౌడ్, కవిత, ఆశా వర్కర్ రమణ తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా స్థిరపడాలి

ములకలపల్లి: మహిళలు ఆర్థికంగా స్థిరపడాలని, తద్వారా సమాజం అభివృద్ధి దిశగా ముందుకు సాగొచ్చని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తాండ్ర ప్రభాకర్‌రావు అన్నారు. మండల పరిధిలోని తిమ్మంపేట, ములకలపల్లిలో శుక్రవారం నిర్వహించిన ఇందిరా మహిళా శక్తి సంబరాల్లో పాల్గొన్న ఆయన మాట్లాడారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఏపీఎం సంపత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రైలు సర్వీసులు పునరుద్ధరించండి

మణుగూరుటౌన్: మణుగూరు నుంచి గతంలో నడిచిన రైలు సర్వీసులన్నీ పునరుద్ధరించడమే కాక సింగరేణి, విజయవాడ ప్యాసింజర్ రైళ్లను పొడిగించాలని ఏఐటీయూసీ వైస్ ప్రెసిడెంట్ రామనర్సయ్య కోరారు. ఈ మేరకు ఆయన రైల్వే అధికారులకు శుక్రవారం వినతిపత్రాలు అందజేసి మాట్లాడారు. కరోనా సమయాన రద్దుచేసిన రైళ్లను పునరుద్ధరించాలన్నారు. అలాగే, సింగరేణి కార్మికుల సౌకర్యార్థం సింగరేణి, విజయవాడ ప్యాసింజర్ రైలును పొడిగించడమే కాక పుణ్యక్షేత్రాలకు రైళ్లు ప్రారంభించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ఆవుల నాగరాజు, దాట్ల సందీప్, ఇమాముద్దీన్, తన్నీటి నారాయణ, శంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కనీస సౌకర్యాలు కల్పించాలి

భద్రాచలంటౌన్: ప్రభుత్వ పాఠశాలల్లో కనీస సౌకర్యాలు కల్పించాలని కోరుతూ పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ రాష్ట్ర కమిటీ సభ్యుడు మునిగేలా శివ ప్రశాంత్ మాట్లాడుతూ పాఠశాలల్లో వసతులు కల్పించకుండా ప్రభుత్వం బడిబాట కార్యక్రమాలు నిర్వహించి చేతులు దులుపుకుందని విమర్శించారు. కళాశాలల్లో ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని కోరారు. భద్రాచలం డివిజన్ అధ్యక్షుడు దండుగుల రామ్ చరణ్, సంధ్య, రవళి, రామ్ చరణ్, పవన్ కల్యాణ్ పాల్గొన్నారు.

మంత్రి తుమ్మలను కలిసిన రైతులు

దమ్మపేట: రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును మండలంలోని గండుగులపల్లి నివాసంలో ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని రైతులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఖమ్మం జిల్లాలో సాగర్ కెనాల్‌కు సాగునీటిని విడుదల చేసిన సందర్భంగా మంత్రి తుమ్మలకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో కొయ్యల అచ్యుతరావు, కాసాని నాగప్రసాద్, చల్లగుల్ల నరసింహారావు, సత్యనారాయణ, వెల్లి జగన్మోహన్, ఫయాజుద్దీన్, పెనుబల్లి సీతారాం, బండి భాస్కర్, చెన్నకేశవరావు తదితరులు పాల్గొన్నారు.

'ప్రజల ఆశలు అడియాసలయ్యాయి..'

భద్రాచలంటౌన్: సీతారామ ప్రాజెక్టు నీరు పక్క జిల్లాకు తరలడంతో పినపాక నియోజకవర్గంలోని అశ్వాపురం, బూర్గంపాడుతో పాటు పాల్వంచ మండలాల ప్రజల ఆశలు అడియాసలయ్యాయని భద్రాద్రి ప్రాంత పరిరక్షణసమితి చైర్మన్ డాక్టర్ బూసిరెడ్డి శంకర్ రెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో ఆరోపించారు. ఓ పక్క గోదావరి, మరోపక్క కిన్నెరసాని ఉన్నా కనీసం చుక్క నీరు అందని మండలాలుగా బూర్గంపాడు, అశ్వాపురం, పాల్వంచలు మిగిలిపోయాయన్నారు. ఇప్పటికైనా ఉమ్మడి జిల్లాల మంత్రులు, ఎమ్మెల్యేలు స్పందించి మూడు మండలాలకు సాగునీరు అందించే విధంగా కృషి చేయాలని ఆయన కోరారు.

కాలువలు ఇలా.. సాగునీరు పారేదెలా?

అశ్వారావుపేటరూరల్: సాగునీరు పారే కాలువలు పిచ్చి మొక్కలు, వ్యర్థాలతో నిండిపోయి అధ్వానంగా మారాయి. దాంతో ఈ కాలువల ద్వారా సాగునీరు ఏలా పారుతుందని రైతులు ప్రశ్నిస్తున్నారు. అశ్వారావుపేట మండలంలోని మారుమూల అటవీ ప్రాంతంలో ఉన్న మొద్దులమడ గ్రామ శివారులో సాగునీరు చెరువు ఉంది. ఈ చెరువు కింద దాదాపు రెండు వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించేందుకు కుడి, ఎడమ కాలువలను గతంలో నిర్మించారు. కాగా, ఈ కాలువలు నిర్వహణ లేక కనీసం శుభ్రం చేసే వారు లేకపోవడంతో పిచ్చి మొక్కలతో నిండిపోయాయి. దీంతో కాలువల ద్వారా సాగునీరు పారడం కష్టంగా మారిందని ఆయకట్టు రైతులు వాపోతున్నారు. తక్షణమే నీటి పారుదల శాఖ అధికారులు దృష్టి సారించి కుడి, ఎడమ కాలువలను శుభ్రం చేయించి తమ పొలాలకు సాగునీరు సక్రమంగా అందేలా చర్యలు తీసుకోవాలని గిరిజన రైతులు కోరుతుంది. దీనిపై స్థానిక ఇరిగేషన్ ఏఈ శ్రీనివాస్‌ను వివరణ కోరేందుకు 'సాక్షి' ప్రయత్నించగా ఆయన అందుబాటులోకి రాలేదు.



మొద్దులమడ చెరువు కాలువను కమ్మేసిన పిచ్చిమొక్కలు